క్లుప్తంగా

ఎంపీ వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు



తాడేపల్లిరూరల్: ఎంపీ వైవీ సుబ్బారెడ్డి జన్మదినాన్ని బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి చిగురు ఆశ్రమంలో విజయవాడ దుర్గగుడి ప్రత్యేక ఆహ్వాన కమిటీ సభ్యులు జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (జేపీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తున్న సుబ్బారెడ్డి నిండు నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బాల బాలికలచే కేక్ కట్‌చేసి, అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉయ్యూరు మధుసూదన్ రెడ్డి, సానికొమ్ము హనుమారెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈవీఎం ఏర్పాట్ల పరిశీలన



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మలా హైస్కూల్‌లో ఈనెల 3వ తేదీ నుంచి జరుగనున్న ఈవీఎం మిషన్ ఏర్పాట్లను బుధవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి పరిశీలించారు. గుంటూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఏర్పాట్లతో పాటు ఈ నెల 5,6 తేదీల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఇవ్వనున్న రెండవ శిక్షణా కార్యక్రమ ఏర్పాట్లను ఆమె పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

విద్యుత్ వృథా అరికట్టాలి

సీఆర్‌డీఏ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ విజయకుమార్

ఫిరంగిపురం: వేసవికాలంలో విద్యుత్ వినియోగదారులు అవసరమైన మేరకు విద్యుత్తును వాడుకోవాలని సీఆర్‌డీఏ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ టి.విజయకుమార్ అన్నారు. అల్లంవారిపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో 2009లో ఏర్పాటు చేసిన 3,15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అధికలోడుతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో దాని స్థానంలో కోటి విలువైన 5 ఎంఈవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని విజయకుమార్ ప్రారంభించారు. అవసరమైన మేరకు విద్యుత్‌ను వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురునాథం, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, సెక్షన్ ఏఈ పుల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత


మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నవులూరు, మక్కేవారిపేట, గోలివారితోట, బాపనయ్యనగర్, ఈఎస్ఆర్ గార్డెన్స్, టిడ్కో గృహ సముదాయంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ డీఈఈ అక్కల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో కలుగనున్న అంతరాయాన్ని ఆయా ప్రాంత వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని కోరారు.

వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం

తాడేపల్లిరూరల్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యత ఏ ప్రభుత్వంలోనూ ఏ ముఖ్యమంత్రి ఇవ్వలేదని, బడుగు బలహీన వర్గాల హక్కులకు ప్రాధాన్యత కల్పిస్తున్న జగనన్నను మరోసారి మనందరం గెలిపించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల అన్నారు. బుధవారం దుగ్గిరాల గ్రామంలోని పలు ప్రాంతాల్లో వివిధ వర్గాలతో ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయాల్లో ఎటువంటి ప్రాధాన్యత ఉండేదో మనందరికీ తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించిన పదవుల్లో మిగతావారిని జోక్యం చేసుకోనీయకుండా వారికి మాత్రమే ప్రాధాన్యత కల్పిస్తూ సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేశారన్నారు. గుంటూరు పార్లమెంట్‌కు కిలారి వెంకట రోశయ్యను, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా మురుగుడు లావణ్యను నిలబెట్టారని, వారి ఎన్నికల గుర్తు ఫ్యానుపై అమూల్యమైన ఓటు వేసి మంగళగిరి కోటపై వైఎస్సార్ సీపీ జెండాను మరోసారి ఎగరవేయాలని పిలుపునిచ్చారు దుగ్గిరాల పర్యటనలో భాగంగా పలు చర్చిలలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నియోజకవర్గ ముఖచిత్రం — తాడికొండ

తాడికొండ ప్రాంతం అచ్చమైన గ్రామీణ ప్రాంతం.. కృష్ణానది తీరంతో పాటు బెజవాడను అనుసంధానం చేసే విస్తారమైన కొండలు ప్రత్యేక ఆకర్షణ. ప్రకృతి అందాలతో పాటు ఆధ్యాత్మికంగానూ ప్రత్యేక సంతరించుకుంది. ఎందరో సృజనశీలురు నడియాడిన గడ్డ. ఉరిమే ఉత్సాహం.. దేవిప్రియ, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత పాకుడురాళ్లు.. రావూరి భరద్వాజ, వాగ్గేయకారుడు, బుర్రకథ పితామహుడు నాజర్, నవలకారుడు ముదిగొండ శివప్రసాద్ వంటి ఎందరో మహనీయులతో పునీతమైన భూమి ఇది.. ఇక్కడి 'గురుకులం' ఘన కీర్తిని ఆర్జించింది. ప్రస్తుతం రాజధాని పేరుతో భూమి, రైతును మయం చేసి, పెత్తందారులు కబంధ హస్తాల్లో బంధి అయింది. బయటపడేందుకు ప్రజలు పోరాడుతున్నారు. –తాడికొండ



తాడికొండంత సృజనశీలురు

- రాజధాని దర్పం • 'గురుకులం'తో దేశవ్యాప్తంగా ప్రసిద్ధి
- ప్రభుత్వంలోనూ కీలకపాత్ర • వాణిజ్య పంటలకు ఆశలసాధం

తాడికొండ నియోజకవర్గంలో వ్యవసాయం ప్రధానం. వాణిజ్య పంటలకు ప్రసిద్ధి. ఏడాదిలో మూడు పంటలతో ఈ ప్రాంతం కళకళలాడుతుండేది. తాడికొండ అడ్డరోడ్డులో ఐఎల్‌టీడీ కొనుగోలు కేంద్రంతో ఈ ప్రాంతం అధికంగా పోగాకు సాగు చేస్తుండేవారు. 1975లో తాడికొండలో నెలకొల్పిన ఏపీ గురుకుల పాఠశాల దేశవ్యాప్త గుర్తింపు తెచ్చింది. సమీపంలోనే లాంఫాం ఏర్పాటు చేశారు. పరిశోధన కేంద్రం కావడంతో ఇక్కడ రైతులకు అనుకూలంగా మారింది. నూతన వంగడాలు పరిచయంతో అధిక దిగుబడులతో పంటలకు ప్రసిద్ధి చెందింది. మిర్చి, పత్తి పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. తాడికొండలో 1240 ఎకరాల్లో విస్తరించి ఉన్న అక్కదేవత చెరువు తాడికొండకు సాగునీటికి వరంగా ఉంది. పేరేచర్లలో క్వారీయింగ్ ద్వారా వందలాది మంది కార్మికులు జీవనం సాగిస్తున్నారు.

భౌగోళిక స్వరూపం..

తాడికొండ నియోజవర్గంలో తాడికొండ, మేడికొండూరు, ఫిరంగిపురం, తుళ్లూరు మండలాలు ఉన్నాయి. సుమారు 15 కిలో మీటర్ల విస్తరించి ఉంది. ఒక పక్క మంగళగిరి, మరో పక్క పెదకూరపాడు, గుంటూరు నియోజకవర్గాలు హద్దులుగా ఉన్నాయి. కృష్ణా నదీతీరం దాటితో కృష్ణాజిల్లా ఉంది.



పేరేచర్ల ప్రాంతంలో మెటల్ క్వారీలు

రాజకీయ ముఖచిత్రం

రాజకీయ చైతన్యానికి నాందిగా నిలిచిన తాడికొండలో ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తూ ఆనవాయితీ. ఇప్పటికి 11 పర్యాయాలు సెంటిమెంట్ ఫలించింది. ఆరు సార్లు కాంగ్రెస్, 4 సార్లు టీడీపీ ఒకసారి టీడీపీ మద్దతుతో సీపీఐ అభ్యర్థి గెలుపొందారు. టీడీపీ తరుపున గెలిచిన జేఆర్ పుష్పరాజ్ ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో మంత్రిగా పనిచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు మంత్రి పదవి వరించింది. నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు కాక ముందు 1967, 72లో పోటీ చేసిన గద్దె వెంకట రత్తయ్య మినహా మిగిలిన ఎస్సీ అభ్యర్థులందరూ స్థానికేతరులే కావడం విశేషం. తాడికొండ గ్రామం నుంచి రాజకీయాల్లో ఎదిగిన వ్యక్తుల్లో మొదటిగా మహ్మద్ జానీ, మహమ్మద్ ముస్తఫా, ఉండవల్లి శ్రీదేవి ఉండగా తుళ్ళూరు మండలం మందడం నుంచి గద్దె రత్తయ్య, పెదపరిమి గ్రామానికి చెందిన నంబూరు శంకరరావు, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, జిల్లా రాజకీయాల్లో పేరు గాంచిన రాయపాటి సాంబశివరావు మేనమామ గోగినేని కనకయ్యది తాడికొండ స్వగ్రామం కావడంతో ఆయనకు ఇక్కడ మంచి పరిచయాలు ఉన్నాయి.

నియోజకవర్గ ప్రత్యేకతలు



- తుళ్లూరు మండలం వెంకటపాలెంలో ప్రసిద్ధి గాంచిన టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం కొలువైంది. దీనికి గుంటూరు– విజయవాడ జంట నగరాల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది.
- ఫిరంగిపురం మండలంలో బాలయేసు కథెడ్రల్ చర్చి రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన ఆలయం. చర్చికి 150 సంవత్సరాల చరిత్ర ఉంది. కొండపై వేంచేసియున్న ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణం నిమిత్తం ఇటీవల సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.39 కోట్లు మంజూరు చేస్తూ ప్రకటించారు.
- అనంతవరంలో కొండపై టీటీడీ ఆలయం కొలువుదీరింది.
- పేరేచర్లలో క్రషర్స్ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు భారీగా మెటల్ సరఫరా అవుతుంది.
- తుళ్లూరు మండలం కృష్ణానది పరీవాహక ప్రాంతంలో తాళ్లాయపాలెం ప్రసిద్ధి గాంచిన శైవక్షేత్రం పీఠం ఉంది.
- ఫిరంగిపురం మండలం వేమవరంలో కోటిలింగాల ఆలయం ఇటీవల ప్రతిష్టించారు.

తాడికొండ నియోజకవర్గంలో జూన్ 2019 నుంచి జూన్ 2023 వరకు వివిధ పథకాలతో లబ్ధి

పథకాలు	లబ్ధిదారులు సంఖ్య	లబ్ధి(రూ.కోట్లలో)
వైఎస్సార్ ఆసరా	13074	214.97
జగనన్న అమ్మ ఒడి	28902	115.19
అర్చకులకు సాయం	140	2.06 లక్షలు
జగనన్న చేదోడు	4131	27.25
కోవిడ్ సాయం	71143	63.75
క్రాప్ ఇన్సూరెన్స్	14632	114
ఈబీసీ నేస్తం	4515	12.21
హౌసింగ్ (డీబీటీ)	4376	59.52
ఇమామ్‌లు సాయం	307	19.06 లక్షలు
ఇన్‌పుట్ సబ్సిడీ	2625	13.48
జగనన్న తోడు (వడ్డీ)	6580	37.49
జగనన్న వసతి దీవెన	11950	20.65
జగనన్న విద్యా దీవెన	11778	37.98
కళ్యాణ మస్తు	1041	84.22
కాపు నేస్తం	5850	45.36
పాస్టర్లకు సాయం	8302	59.41
వైఎస్సార్ పెన్షన్లు	43822	312.88
రైతు భరోసా	30720	109.61
సున్నావడ్డీ పంట రుణాలు	11225	38.20
సున్నా వడ్డీ	54881	76.11
వాహన మిత్ర	3331	10.20
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	8739	16.59
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	11666	48.75
వైఎస్సార్ భీమా	2280	11.59
వైఎస్సార్ చేయూత	13668	66.63
మొత్తం	403631	1150.85
నాన్ డీబీటీ పథకాలు		
జగనన్న గోరుముద్ద	14702	14.41
ఇళ్ళ స్థలాలు	5420	123.09
జగనన్న తోడు లోన్లు	8070	71.54
రైస్‌కార్డులు	18560	593.44
విద్యార్థులకు ట్యాబ్‌లు	5885	26.63
జగనన్న విద్యాకానుక	13682	12.02
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	12060	22.48
మొత్తం	13233	392.72



ఓటర్లు

పురుషులు	ఇతరులు
99,642	1
మహిళలు	**మొత్తం**
1,07,015	2,06,658



హోరెత్తిన వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

- తాడేపల్లి రూరల్‌లో ఒకేరోజు 15 బృందాలుగా ఏర్పడి నాయకులు, బూత్ కన్వీనర్ల ప్రచారం
- ఫ్యాను గుర్తుకు ఓటేయాలని ఓటర్లకు అభ్యర్థన

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్‌లో పది ప్రాంతాల్లో ఒకేరోజు 15 బ్యాచ్‌లుగా విడిపోయి వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్లు, నాయకులు బుధవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు వేయాలంటూ నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి రూరల్‌లో చేసిన అభివృద్ధితో పాటు ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

పెనుమాకలో రెండు టీమ్‌లుగా విడిపోయి పార్టీ అధ్యక్షులు మేకా దామేష్‌రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ మేకా శివారెడ్డి, కళ్ళం అరవిందరెడ్డి, బొక్కా ప్రసన్నకుమార్ (నాని), పులి భుజంగరావు, బషీర్, అన్నూరి ప్రభాకర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. రోడ్ల అభివృద్ధి, స్మశాన వాటికలకు కేటాయించిన నిధులు, తాగునీటి పైపులైన్ల గురించి వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రాజధాని రైతు కూలీలకు ఇస్తున్న రూ.5 వేల పెన్షన్, ఇతర సామాజిక పెన్షన్లు ప్రజల చెంతకు చేరకుండా టీడీపీ చేసిన కుట్రను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నారా లోకేష్ నివాసముంటున్న ఉండవల్లిలో 2014 నుంచి 2019 వరకు ఎంత నిధులు కేటాయించారు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు ఎంత నిధులు కేటాయించారు.. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందిస్తున్న సామాజిక పెన్షన్లు ఎన్ని ఉండేవి.. ఇప్పుడు ఎన్ని ఇస్తున్నారో వివరిస్తూ పార్టీ అధ్యక్షులు దంటు గోవర్ధన్ రెడ్డి, కళ్ళం పిచ్చిరెడ్డి,



కుంచనపల్లిలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య

మున్నంగి శ్రీధర్ రెడ్డి, జెసీఎస్ మండల కన్వీనర్ అనిల్, నక్కా ఆనంద్‌బాబు, సుకుమార్, శ్రావణ్, రమేష్‌లతో పాటు పలువురు మహిళలు పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

జాతీయ రహదారి వెంబడి ఉన్న కుంచనపల్లిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి, డ్రైనేజీలను ప్రజలకు గుర్తు చేస్తూ ఇంకా ఏమేమి సమస్యలు ఉన్నాయో వాటిని ఎలా పరిష్కరిస్తారో వివరిస్తూ ఆయా ప్రాంతాల్లో కాపులకు, రెడ్లకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, పార్టీ అధ్యక్షులు మిరియాల రాంబాబు ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు కూరపాటి సాంబిరెడ్డి, దొంతిరెడ్డి తిరుమల రెడ్డి, బిరుదుగడ్డ చిలకయ్య, బిరుదుగడ్డ విజయేంద్రరావు, తమ్మిశెట్టి శివనాగేశ్వరరావు, తాడిశెట్టి సుబ్రహ్మణ్యం, బుల్లా బుల్లయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. వడ్డేశ్వరంలో మూడు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒక ప్రాంతంలో పెరిక సంఘం నాయకులు కత్తిక రాఘవరావు, మరో ప్రాంతంలో కత్తిక మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), మరో ప్రాంతంలో పార్టీ అధ్యక్షులు గొడవర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు, రిజిస్ట్రేషన్లు, నిర్మించిన కమ్యూనిటీ హాళ్లు, ఎప్పటి నుండో పెండింగ్‌లో వున్న రహదారుల నిర్మాణాలు, సంక్షేమ పథకాలు.. గత ప్రభుత్వంలో ఏ విధంగా అమలు చేశారు.. ఇప్పుడు ఏ విధంగా అమలు చేస్తున్నారో వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్ ముల్లీబ్, యస్‌కె మీర్ షా, చినరంగా షరీఫ్, చంద్రరావు, రవి, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు

ప్రాతూరు మాజీ సర్పంచ్ మేరిరాణి, సంకురు మరియబాబు, వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గుండిమెడలో నామతోటి కోటేశ్వరరావు, తాడేపల్లి రూరల్ మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, బూత్ కన్వీనర్లు ప్రచారం నిర్వహించారు. చిర్రావూరులో పార్టీ అధ్యక్షులు, సొసైటీ ప్రెసిడెంట్ మేకల సాంబశివరావు ఆధ్వర్యంలో ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారు. కొలనుకొండ, ఇప్పటం, మెల్లెంపూడి ప్రాంతాల్లో జెసియస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, నూతక్కి శ్రీనివాసరావు, రాజారెడ్డి, బషీర్ తదితరుల ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్నినిర్వహించారు.

సీఎం వైఎస్ జగన్‌తో అన్ని వర్గాలకు మేలు

పెదపరిమి(తాడికొండ): అన్ని వర్గాలకు సమన్యాయం చేసిన జగనన్నకు ప్రజాదరణ మెండుగా ఉందని, రాబోయే ఎన్నికల్లో ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కుమారుడు మేకతోటి హర్షిత్ బాబు అన్నారు. తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నంబూరు శంకరరావు సోదరుడు నంబూరు రఘునాథరావుతో కలిసి ప్రచార రథంపై నుంచి గ్రామంలో రోడ్ షో నిర్వహించిన అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేసిన ఏకైక ముఖ్యమంత్రి భారతదేశంలో ఉన్నారంటే అది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ఇంటింటికీ తిరిగి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తన తల్లి మేకతోటి సుచరిత, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యలను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ పాలనలో పేదలకు న్యాయం

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య
- ద్వారకానగర్, చినకాకానిలో ఎన్నికల ప్రచారం

మంగళగిరి: సంక్షేమ పథకాలతో పేదలందరికీ న్యాయం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య అన్నారు. బుధవారం ఆమె నగరంలోని ద్వారకానగర్, చినకాకానిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలుకగా మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. మురుగుడు లావణ్య మాట్లాడుతూ ఎన్నికల హామీలను 99 శాతం నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రకటించిన మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని, పొందిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమించారని, రాష్ట్రంలో ఎన్నడూ లేని అభివృద్ధి జగనన్న హయాంలోనే జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రెండు ఓట్లు సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీగా కిలారి రోశయ్యను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



మురుగుడు లావణ్యకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

కేఎల్‌యూ అధ్యాపకులకు పురస్కారాలు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వ విద్యాలయంలో నలుగురు మహిళా అధ్యాపకులకు ఇన్‌స్పైరింగ్ ఉమెన్ అవార్డులు లభించినట్లు విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోర్త్ స్ట్రీక్స్ ఎడ్యుకేషన్ అనే సంస్థ తమ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న నలుగురు మహిళా అధ్యాపకులకు ఇన్‌స్పైరింగ్ ఉమెన్ అవార్డులను అందజేసిందని తెలిపారు. ఈ అవార్డులను అందుకున్న వారిలో స్టూడెంట్స్ అఫైర్స్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, ఐక్యు ఏసి అసోసియేట్ డీన్ డాక్టర్ పి.లక్ష్మి ప్రసన్న, సీఎస్ఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.విద్యుల్లత, సీఎస్ఈ ప్రొఫెసర్ డాక్టర్ సాగర ఇమాంబీలకు పరిశోధనలు, అకడమిక్‌ల రంగాలలో కృషి చేసినందుకు ఈ అవార్డులు లభించాయని తెలిపారు. అవార్డులు లభించిన అధ్యాపకులను వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు అభినందించారు.



పురస్కారాలు అందుకున్న అధ్యాపకులతో వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ

ఘనంగా కార్మిక దినోత్సవం

తాడేపల్లిరూరల్ : కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని తాడేపల్లి నులకపేట యూనియన్ కార్యాలయం వద్ద బుధవారం ఆటో డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ శ్రీను, ఇతర నాయకులు జెండాను ఆవిష్కరించారు. పాపాయమ్మ కొట్టు సెంటర్ వద్ద ఉన్న ఆటోస్టాండ్ వద్ద ఆర్. శ్రీనివాసరావు, మార్కెట్ స్టాండ్ నందు షేక్ ఖాసిం, డాల్డా కంపెనీ వద్ద ఉన్న ఆటో స్టాండ్ నందు జి. శ్రీనివాసరావులు జెండాలను ఆవిష్కరించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు.

వాడవాడలా మేడే వేడుకలు

తాడికొండ: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకొని వాడవాడలా వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాడికొండలో నిర్వహించిన మేడే వేడుకలకు ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంచాల సుశీల్ రాజా ముఖ్య అతిథిగా పాల్గొని వామపక్షాల నాయకులతో కలిసి తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు, పంచాయతీ కార్యాలయం, అడ్డరోడ్డు ఆటో వర్కర్స్ యూనియన్, పొన్నెకల్లు పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్ర జెండాను ఆవిష్కరించారు.



జెండా ఆవిష్కరించిన మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

రోడ్‌షో, బహిరంగ సభను విజయవంతం చేద్దాం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్

తాడేపల్లిరూరల్ : ఇండియా కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి అజయ్‌కుమార్, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరిలో గురువారం నిర్వహించనున్న రోడ్‌షో, బహిరంగ సభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం నిర్వహించనున్న రోడ్‌షో, బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ, సీపీఎం రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొననున్నారని వివరించారు.



మాట్లాడుతున్న జంగాల అజయ్ కుమార్